క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ


ఎస్‌ఐ చెన్నకేశవ

పెద్దమండ్యం : పెద్దమండ్యం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా వై. చెన్నకేశవ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్ మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. రాజంపేటలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న చెన్నకేశవను పెద్దమండ్యం ఎస్‌ఐగా బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాలు ఇచ్చారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో సజావుగా ఎన్నికల విధులు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నాటుసారా తయారీ, అమ్మకాలు, కోడిపందెం, జూదం ఎక్కడైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీమా పాలసీలపై అవగాహన కల్పించాలి

తంబళ్లపల్లె : మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథం మహిళా సంఘ సభ్యులకు సోషియల్ సెక్యూరిటీ స్కీం బీమా పాలసీలపై అవగాహన కల్పించాలని ఇండియన్ బ్యాంకు మేనేజర్ హరినాథ్‌గుప్తా కోరారు. బుధవారం స్త్రీశక్తి భవనంలో సంఘమిత్రలు, బ్యాంకుమిత్రలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరినాథ్‌గుప్తా మాట్లాడుతూ సోషియల్ సెక్యూరిటీ స్కీం సీఎం జేజేసీవై, ఏపీవై బీమా పాలసీలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ బీమా పాలసీలు పొందిన వారికి ప్రమాదంలో అంగవైకల్యం చెందిన, మృతి చెందిన బీమా పొందవచ్చునన్నారు. మహిళా సభ్యులు బీమా పాలసీలు తీసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

శ్రీపరవాసుదేవ అవతారంలో లక్ష్మీజనార్దనుడు


ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం : రామసముద్రం మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీజనార్దనస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు శ్రీపరవాసుదేవ (వైకుంఠ నారాయణుడు) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారథి బట్టర్, కులశేఖర్‌బట్టర్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పోలింగ్ బూత్ ఏర్పాట్ల పరిశీలన

కలకడ : మండలం లోని అన్ని పోలింగ్ బూతులలో ఓటర్లకు సౌకర్యాలు కల్పించే బాధ్యత మన అంతదరిపై ఉందని తహసీల్దార్ ప్రియదర్శిని అన్నారు. బుధవారం మండలం లోని కదిరాయచెర్వు, కత్తివారిపల్లె, కె.బాటవారిపల్లె, ఎర్రకోటపల్లె గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సంబంధించి సౌకర్యాలను పరిశీలించారు. వృద్ధులు, వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకునే రోప్, తాగునీరు, తదితర సౌకర్యాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కీర్తన, వీఆర్‌ఓలు ఆంజనేయులు నాయక్, రవిచంద్రన్, రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఇన్‌చార్జిగా సుధీర్‌రెడ్డి



పీలేరు రూరల్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పీలేరు, కేవీపల్లె మండలాలకు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డిని నియమించినట్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

కల్యాణం.. కమనీయం

వాల్మీకిపురం : స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. ఉదయం సుప్రభాతసేవతో సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.


విశేష అలంకరణలో సీతారామలక్ష్మణులు

ప్రవక్తలు మార్గనిర్దేశకులు

- మంచి మనసు దేవుని నివాసమే
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


అంగళ్లు ఉరుసులో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

కురబలకోట : కంటికి కన్పించకుండా మానవ జీవితమనే మహా నాటకాన్ని ఆడించేది మనసని.. లౌకిక జీవనం పునాదిగా అలౌకిక జీవితానికి మార్గదర్శకం చేయడం మన ఆధ్యాత్మిక గొప్పతనమని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం రాత్రి అంగళ్లులో హజ్రత్ సయ్యదినా షేఖ్ అబ్దుల్‌ఖాదర్ జిలాని పీరా నెపీర్ గౌసుల్ అజం దస్తగీర్ వారి ఉరుసు ఉత్సవంలో భాగంగా గంధం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్తలు మార్గనిర్దేశకులని కొనియాడారు. సుఖ దుంఖాలు మనిషికి సర్వ సాధారణమన్నారు. శరీరం ఆత్మకు తొడుగు వంటిదని పేర్కొన్నారు. ఔషధం కాని చెట్టు లేదు.. పనికి రాని మనిషి లేడని వ్యాఖ్యానించారు. మాటతో జీవితం మారుతుందని, అదే మాట తేడాతో యుద్ధాలు జరిగిన సందర్భాలు చరిత్రలో కన్పిస్తాయని గుర్తుచేశారు. తప్పును పెద్ద మనసుతో క్షమించగలిగిన వారు దైవ సమానులన్నారు. దేవుడు మసీదులు, మందిరాలు, గుడులలోనే కాకుండా మంచి తనం ఉన్న ప్రతి మనిషిలో కూడా ఉండాలని అన్నారు. ఆధ్యాత్మికత కష్ట నష్టాల్లో మనిషికి రక్షణ కవచంగా నిలుస్తుందని చెప్పారు. సన్మార్గంలో జీవిస్తే సిరి సంపదలు ఆస్తిపాస్తులు లేకున్నా మా రాజులా బతకవచ్చని పేర్కొన్నారు.

'పది'లో మనమే ముందుండాలి

పదో తరగతి ఫలితాల్లో తంబళ్లపల్లె నియోజకవర్గ విద్యార్థులు ముందుండాలని ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఆకాంక్షించారు. బుధవారం రాత్రి మండలంలోని చేనేత నగర్ బీసీ గురుకుల పాఠశాలలో జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సారి వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు ఇంటి పట్టాల పంపిణీ

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మండలంలోని అంగళ్లు గ్రామం బ్రాహ్మణ ఒడ్డుపల్లెలో గురువారం ఉదయం పేదలకు ఇంటిపట్టాలు పంపిణీ చేస్తారని జెడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ బి. దస్తగిరి, సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి తెలిపారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

సబ్ కలెక్టర్ హరిప్రసాద్


రామసముద్రంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ హరిప్రసాద్

రామసముద్రం : సార్వత్రిక ఎన్నికలకు అధికారులందరూ సిద్ధంగా ఉండాలని సబ్‌కలెక్టర్ హరిప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే వెలువడుతుందని తెలిపారు. ఎన్నికలకు అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఓటరు జాబితాలో అవకతవకలు లేకుండా బీఎల్‌ఓలు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరూ జాబితాలో చేర్పించాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి రౌడీషీటర్లపై నిఘా పెట్టాలన్నారు. సబ్ కలెక్టర్ పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నారాయణస్వామి, ఎస్‌ఐ చంద్రశేఖర్, డీటీ నారాయణస్వామి, ఆర్‌ఐ నాగరాజ, సర్వేయర్ నాగరాం, ఎంఈఓ హేమలత, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణాలు కాపాడుదాం

- కార్పొరేటుకు ధీటుగా ప్రభుత్వ వైద్యశాల
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


రక్త నిల్వ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : రక్తదానం చేసి.. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుదామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన ల్యాబ్ పరికరాలు, రక్త నిల్వ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం కోసం బయట ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే రక్తం దొరకడంతో ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చన్నారు. అంతేకాకుండా ఎవరైనా దాతలు రక్తదానం చేస్తే ఇక్కడే నిల్వ చేసుకోవచ్చునని, ఆపద సమయంలో ఇది ఎంతో మందికి ఉపయోగపడుతుందన్నారు. అలాగే రూ.25 లక్షలతో ల్యాబ్ పరికరాలు కంప్లీట్ బయో అనలైజర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరికరం వలన రక్త పరీక్షలు, లివర్, కిడ్నీ పరీక్షలు, పూర్తి రక్తంలో కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వంటి పరీక్షలు ఇక్కడే చేయడం జరుగుతుందన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.5, 6వేలు విలువ చేసే పరీక్షలు ఇక్కడ ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, డాక్టర్లు శివాని, హర్షిత రెడ్డి, శ్రీలక్ష్మి, సోని, కిషోర్, శ్రీనివాసులు, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల ఆనందరెడ్డి, చింతల శివానందరెడ్డి, నీళ్ల భాస్కర్, కేశవరెడ్డి, అబ్దుల్ కలీమ్, శంకరాచారి, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఆదాయం రూ.2.5 కోట్ల లక్ష్యం

మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి


మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి, వెంకటేష్‌బాబు

మదనపల్లె : వ్యవసాయ మార్కెట్ కమిటీ వార్షిక ఆదాయాన్ని రూ.2.50 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికలు రూపొందించామని మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వైస్‌చైర్మన్ ఎం.ఆర్.వెంకటేష్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో నూతన పాలకవర్గం తొలిసారిగా కొలువుదీరింది. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి పాలకవర్గానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన పాలక మండలి సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్లో కొంతమంది మండీ యజమానులు రూ.35 లక్షల అద్దె బకాయిలు ఉన్నారని, వీరికి నోటీసులు ఇచ్చి అద్దెవసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మార్కెట్లో ఖాళీగా ఉన్న 52 స్థలాలను మండీ యజమానులకు అద్దెకు ఇచ్చే విషయమై సభ్యుల ఆమోదానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. మార్కెట్‌యార్డులో పాడుబడిన గోడౌన్‌ను మరమ్మతులు చేయించి, అద్దెకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌యార్డులో పాడుబడిన భవనం స్థానంలో రూ.45 లక్షల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్, సభ్యులు అపర్ణ, లక్ష్మీదేవి, సుమ, రమణప్ప, జయమ్మ, శంకర్‌నాయక్, రేణుక, రెడ్డెమ్మ, ఆశ, గంగుల్‌రెడ్డి, మాజీ చైర్మన్ తట్టిశారదమ్మ, మాజీ వైస్‌చైర్మన్ గొడసాని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజపరచిన వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఏపీ టూరిజం కౌన్సిలర్ మెంబర్ షాకీర్, జావేద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బైక్ ర్యాలీ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపింది. బుధవారం ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పీలేరు పర్యటన సందర్భంగా స్థానిక మదనపల్లె రోడ్డు తిమ్మారెడ్డి క్రాస్ నుంచి తిరుపతి రోడ్డు మార్గం వీఎస్‌ఆర్ కల్యాణమండపం వరకు 'జై జగన్' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మహిత, షబ్బీర్, చైతన్యరెడ్డి, రియాజ్, సాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం


శివయ్యను సన్మానిస్తున్న అధ్యాపకులు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన శివయ్యను ఘనంగా సన్మానించారు. బుధవారం గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీలో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. శివయ్య కుమారుడు, చిత్తూరు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నకేశవులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

- చాందినీబండ్లకు అనుమతి తప్పనిసరి
- సీఐ ఎస్.శేఖర్



మదనపల్లె : మండలంలోని సీటీఎంలో ఫిబ్రవరి 24 నుంచి ప్రారంభం కానున్న శ్రీ నలవీర గంగాభవాని జాతర మహోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అంగరంగ వైభవంగా జరగనున్న సీటీఎం జాతర నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయం వద్ద ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. మదనపల్లె నుంచి తిరుపతి వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు కొత్తవారిపల్లె క్రాస్ మీదుగా, తిరుపతి నుంచి మదనపల్లెకు వచ్చే వాహనాలను కాశీరావుపేట వద్ద డైవర్ట్ చేస్తున్నామని తెలిపారు. జాతర సందర్భంగా డీజే, అసభ్యకర నృత్యాలను పూర్తిగా నిషేధించామన్నారు. చాందినీబండ్లు కట్టే భక్తులు సీటీఎంలోని రైల్వే విద్యుత్‌లైన్‌ను దృష్టిలో పెట్టుకుని 10–12 అడుగులు ఎత్తులో మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. చాందినీబండ్లకు పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జాతర సందర్భంగా సీటీఎం పరిసర ప్రాంతాల్లో అక్రమ మద్యం, గొడవలు, ఘర్షణలకు పాల్పడటం, దొంగతనాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు కేవీపల్లెలో ఎంపీ పర్యటన

కేవీపల్లె : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం కేవీపల్లె మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మండలంలోని వగ్గల్లో ఉదయం 9 గంటలకు కరీమా ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలకడ : పీలేరు డివిజనల్ పరిధిలోని గ్యారంపల్లె 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా నేడు (గురువారం) ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఏఈ వరప్రసాద్ తెలిపారు. మరమ్మతు పనులు పూర్తి అయిన వెంటనే విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. వినియోగదారులు ఈ అంతరాయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మదనపల్లె సిటీ : మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లపూడి తిరుపతి రావు, ఉపాధ్యక్షుడిగా మునిరత్నం, ప్రధాన కార్యదర్శిగా భాస్కరాచారి, జాయింట్ సెక్రటరీగా రాజారెడ్డి, కోశాధికారిగా రామచంద్రరావు, కార్యవర్గసభ్యులుగా సురేష్‌కుమార్‌రెడ్డి, ఆదిరెడ్డి, రెడ్డప్ప, వెంకటరమణను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా భాస్కరనాయుడు, కృష్ణమూర్తి, రామచంద్రయ్య ఎన్నికయ్యారు.

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం


రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి

గుర్రంకొండ : చేయిచేయి కలిపి క్షయవ్యాధిని నిర్మూలిద్దామని జిల్లా క్షయవ్యాధి నిజనిర్ధారణ కమిటీ సభ్యులు డాక్టర్లు చంద్రశేఖర్, చంద్రశేఖర్‌నాయక్‌లు పిలుపునిచ్చారు. క్షయను నిర్లక్ష్యం చేస్తే ప్రాణంతకం అవుతుందని హెచ్చరించారు. 2023–24 ఏడాదికి సంబంధించి మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ క్షయవ్యాధి రహిత పంచాయతీగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో పర్యటించి స్థానిక హరిజనవాడలో ఇంటింటి సర్వే నిర్వహించారు. విలేజ్ క్లీనిక్‌ను సందర్శించి రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తులు క్రమం తప్పకుండా ఆరునెలల పాటు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే మందులను వాడుకోవాలని సూచించారు. మందులతో పాటు పోషకాహారం ప్రతిరోజు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరునెలలకొక మారు ట్రూనాట్ మిషన్ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగికి ప్రభుత్వం కింద రూ.3 వేలు ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రవీంద్రనాయక్, సర్పంచ్ సుబ్బమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు నాగరాజు, మోహన్, నాగిరెడ్డి, భూపతి, ఫీల్డ్ కమ్యూనిటీ ఆఫీసర్ ఆషారాణి, ఎఎన్ఎమ్ నిర్మల, ఆశావర్కర్ సుజాత పాల్గొన్నారు.

కేవీపల్లె : క్షయవ్యాధి నిర్మూలనకు సమిష్టి కృషి అవసరమని టీబీ ముక్త గ్రామ పంచాయతీ వెరిఫికేషన్ టీం లీడర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కేవీపల్లె మండలం ఎంపీపల్లె ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ నిర్మూలనకు ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పీలేరు టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ, సూపర్‌వైజర్లు పవన్‌కుమార్, మోహన్, పురుషోత్తం, సిబ్బంది కల్పన, ఝాన్సీ, సాలమ్మ, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


తాగునీటి బోరును పరిశీలిస్తున్న అధికారులు

పెద్దమండ్యం : వేసవి దృష్ట్యా భూగర్భజలాలు అడుగంటి పోయి తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీహరి తెలిపారు. మండలంలోని శివపురం గ్రామంలో గొల్లపల్లె, బుషిరెడ్డిగారిపల్లె, ఎన్‌ఓపల్లె గ్రామంలోని ఎన్‌ఓపల్లె తండా, వడ్డిపల్లె, మిట్టవాండ్లపల్లెల్లో బుధవారం తాగునీటి బోర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటిని వృథా చేయకుండా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలో ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. అధికారులు ఈ మేరకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ హరిప్రసాద్, సర్పంచ్‌లు గంగులమ్మ, పద్మావతమ్మ, ఏఈలు గణేష్, భవాని పాల్గొన్నారు.

రేపు అక్కదేవతల ఉత్సవాలు


మర్రిపాడులో వెలసిన అక్కదేవతలు

గుర్రంకొండ : మండలంలోని మర్రిపాడు గ్రామంలో వెలసిన శ్రీ అక్కదేవతల ఉత్సవాలు ఈనెల 23న శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. శుక్రవారం గ్రామంలోని అలివేలమ్మ ఇంటి నుంచి అక్కదేవతల గుర్రాలను, నాగదేవతల విగ్రహాలను మేళతాళాలతో గ్రామానికి సమీపంలోని శ్రీ అక్కదేవతల ఆలయం వద్దకు తీసుకెళుతారు. ఆలయంలో ఉన్న శివపార్వతుల విగ్రహాలకు, ఆంజనేయస్వామికి, అయ్యప్పస్వామి, నాగదేవతలు, అక్కదేవతలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కోలాటాలు, చెక్కభజనలు పెద్ద ఎత్తున నిర్వహించి భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు జి. వెంకటరమణ తెలిపారు.

జబ్బల శ్రీనివాసులుతో నిసార్ అహ్మద్ భేటీ


శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిసార్ అహ్మద్ తదితరులు

మదనపల్లె : ఏపీ కురుబ, కురుమ, కురువ రాష్ట్ర అధ్యక్షుడు, సౌత్ ఇండియా ఓబీసీ అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులును బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీం అస్లాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కురవంకలోని శ్రీనివాసులు ఇంటికి నిసార్ అహ్మద్ వెళ్లారు. ఈ సందర్భంగా జబ్బల శ్రీనివాసులు, మీనా దంపతులు నిసార్ అహ్మద్‌ను సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నిసార్ అహ్మద్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కురుబలకు పెద్దపీట వేస్తూ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలుగా రాజకీయ అవకాశాలు కల్పించారని కొనియాడారు. బీసీ సంక్షేమానికి పెద్దమొత్తంలో నిధులు కేటాయిస్తూ, కార్పొరేషన్‌లను ఏర్పాటుచేయడమే కాకుండా చైర్మన్, డైరెక్టర్ తదితర నామినేటెడ్ పదవులను కేటాయించారన్నారు. టీడీపీ కురబలను మోసం చేసేందుకు మరోసారి ప్రయత్నిస్తోందని జబ్బల శ్రీనివాసులు ఆరోపించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, కౌన్సిలర్ బి.ఎ.ఖాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

ఎంపీడీఓ వెంకటరమణయ్య


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దమండ్యం : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఎంపీడీఓ వెంకటరమణయ్య అన్నారు. పాఠశాలలో పది, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇష్టపడి చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వ్యాసరచన, ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామాంజులునాయక్, ఎస్‌ఐ వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ అనీల్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రసాద్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణవేణి

మదనపల్లె సిటీ : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాతృభాషలోనే రాయడం, చదవడం, సంభాషించాలని సూచించారు. తెలుగుభాష ప్రాధాన్యతను తెలుగుశాఖాధిపతి డాక్టర్ బి.జ్యోతి వివరించారు. అనంతరం విద్యార్థులకు కవితలు, పద్య పఠనం, గేయాలు, వ్యక్తిత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్‌అహ్మద్, వనజ, గురుమూర్తి, ఖాజావల్లి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ భాష అమృతం

అమ్మ భాష అమృతం లాంటిదని ప్రముఖ తెలుగు ఆచార్యులు చంద్రశేఖర్ అన్నారు. మాతృభాష తెలుగే తనలోని రచయితను పరిచయం చేసిందని తెలిపారు. బుధవారం స్థానిక మరసం కార్యాలయంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వతంత్ర భాషతో అనుభవించడం గొప్ప అనుభూతి ఉందన్నారు. పి.వి.ప్రసాద్, రాంమోహన్‌నాయుడు, రాంమోహన్‌రెడ్డి పద్యాగానంతో, కరుణాకర్ తన కవితా పఠనంతో ఆహ్లాదపరిచారు. అనంతరం కవులకు సన్మానించారు. కార్యక్రమంలో మరసం ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి, రచయితలు నాగరాజు, రామమోహన్‌రెడ్డి, సభాపతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మాధుర్యం మరువలేనిది

పీలేరు రూరల్ : మాతృభాష మాధుర్యం మరువలేనిదని విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు ప్రసాద్, తెలుగు భాషా సమితి అధ్యక్షుడు జలకనూరి మురళీధర్‌రాజు అన్నారు. బుధవారం సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మురళీధర్‌రాజు మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణలో భాగంగా బంగ్లాదేశీయులు (అప్పటి తూర్పు పాకిస్తానీయులు) చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా యునెస్కో 1999 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంగా ప్రకటించినట్లు తెలిపారు. మాతృభాష మానవ మనుగడకు మూలాధారమని, మాతృభాషాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలుగు పద్యాలు, కవితలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శ్రీరాములురాజు, చంద్రశేఖర్, రాజన్న, మురళి, బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.